

## కాచి చల్లార్చిన నీటిని తాగాలి


### పిహెచ్‌సి వైద్యాధికారి రమేష్

**ప్రజాశక్తి - ఆకివీడు**

వాతావరణం సీజన్ మారింది. కొత్తనీరు వస్తోందని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించాలని ఆకివీడు మండల పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.రమేష్ సూచించారు. బుధవారం పెదకాపవరం ఆసుపత్రిలో మాట్లాడుతూ కొత్తనీరుతో డయేరియా వచ్చే పరిస్థితులు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు నీటిని క్లోరినేషన్ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఆమేరకు తమ సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. నీటి మార్పు వల్ల మలేరియా వచ్చే ప్రమాదం కూడా ఉందని ఆయన చెప్పారు. మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈనెల 25వ తేదీ వరకు మాసోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. క్షయ నివారణకు మండలంలో ప్రత్యేకంగా ప్రచారం చేస్తున్నామని, ప్రతిఒక్కరూ సహకరించాలని తెలిపారు.

# యథేచ్ఛగా మట్టి తవ్వకాలు..!

## నిత్యం వందల ట్రాక్టర్లతో మట్టి తరలింపు - అధ్వానంగా రహదారులు - పట్టించుకోని అధికారులు



పెనుమంచిలిలో యంత్రాల ద్వారా తవ్వుతున్న మట్టి

**ప్రజాశక్తి - ఆచంట**

మండలంలో మట్టి మాఫియా ఆగడాలు మితిమీరి పోతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుండడంతో ఆ స్థలాలను పూడ్చడానికి మండలంలోని వరిచేల నుంచి నిబంధనలకు విరుద్ధంగా యంత్రాల ద్వారా మట్టిని తవ్వి ట్రాక్టర్లపై తరలించి విక్రయిస్తున్నారు. వరి చేల్లోని మట్టిని తవ్వాలంటే రెవెన్యూ, గనుల శాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఎటువంటి అనుమతులు లేకుండానే ఇక్కడ నుంచి మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఆచంట, కొడమంచిలి, కోడేరు, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం తదితర గ్రామాల్లో సారవంతమైన భూముల్లోని వేల ట్రాక్టర్ల మట్టిని తవ్వేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లు గడిస్తున్నారు. ఒక పక్క సారవంతమైన పంట భూములను మట్టితో పూడ్చిపెట్టి లేఅవుట్లు చేస్తున్నారు. అనుమతులు తీసుకోకుండా అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పి దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మెరక వరి చేలను పల్లం చేసుకుంటున్నామంటూ రైతులతో దరఖాస్తులు ఇప్పించి తవ్వేస్తున్నారని సరిహద్దు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల ట్రాక్టర్లు అధిక మట్టిలోడుతో రహదారులపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయి. ఎక్కువ ట్రిప్పులు వేయడమే లక్ష్యంగా ఈ వ్యవహారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనికితోడు బుధవారం వర్షం పడడంతో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మట్టి రహదారిపై పేరుకుపోవడంతో కనీసం ద్విచక్ర వాహనాలు, పాదచారులు ఆ మార్గం గుండా ప్రయాణించడానికి భయపడుతున్నారు.



కరుగోరుమిల్లి పైడివారిపేటలో మట్టితో అధ్వానంగా ఉన్న రహదారి



పాలకొల్లులో కురుస్తున్న వర్షం

## జిల్లాలో పలు చోట్ల వర్షం

**ప్రజాశక్తి - ఉండి**

బుధవారం తెల్ల వారుజాము నుంచి మండలంలో భారీ వర్షం పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ జలమయంగా మారాయి. ఆర్‌ఒబి ప్రాంతంలో గుంతల్లోకి నీరు చేరడంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారిపైకి డ్రెయినేజీ నీరు ప్రవహించడంతో విద్యార్థులు, ఆసుపత్రికి వెళ్లే రోగులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో తెల్లవారుజాము నుంచే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

**నరసాపురం :** జిల్లాలోని పలు మండలాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. అత్యధికంగా పెనుమంట్ర 60.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలంలో 1.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భీమవరంలో 48.8, వీరవాసరం 47.2, పాలకోడేరులో 40.4, పాలకొల్లులో 38.4, పోడూరులో 20.6, ఆకివీడులో 19.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

**ఆకివీడు :** మండలంలో ఎట్టకేలకు బుధవారం ఉదయం వర్షం పడింది. సుమారు రెండు గంటల పాటు వర్షం పడింది. వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

**పెనుమంట్ర :** బుధవారం తెల్లవారుజాము నుంచి మండలంలో ఏకధాటిగా వర్షం పడింది. పెనుమంట్ర మండలంలో ఏకంగా 60.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. దీంతో పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పెనుమంట్ర పరిసర గ్రామాల్లో ఈదురు గాలులు వీశాయి. వర్షం పడడంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

**పాలకొల్లు :** పాలకొల్లులో బుధవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు మెరుపులతో తేలికపాటి వర్షం పడింది. నాలుగు రోజులుగా ఎండ, ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు మారిన వాతావరణంతో ఉపశమనం పొందారు. ఈదురుగాలులకు భగ్గేశ్వరంలో చెట్టుకొమ్మలు రోడ్డుపై పడడంతో పాలకొల్లు - భీమవరం మధ్య ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాలకొల్లు అగ్నిమాపక సిబ్బంది వెంటనే చెట్టు కొమ్మలు కత్తిరించి తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది.

**పిడుగు పడి విద్యుత్ ఉపకరణాలు దగ్ధం**

**మొగల్తూరు :** ఉరుములు మెరుపులతో కూడిన వర్షం బుధవారం తెల్లవారుజామున కురిసింది. వాతావరణంలోని మార్పులు ఒక్కసారిగా మారడంతో ప్రజలు ఆందోళన చెందారు.మొగల్తూరు పంచాయతీ పరిధి అగ్రహారంలో పిడుగు పడటంతో ఆప్రాంతంలోని నివాసాలలోని ఉండే ఫ్రిజ్లు, టీవీలు, ఫ్యానులు తదితర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయ. దీంతో లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆచంట :** బుధవారం మండలంలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఒక పక్క ఎండ మరో పక్క వర్షం పడుతూ వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకోవడంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఈ వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దమ్ములు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

# ప్రయివేటు విద్యాసంస్థల దందా..!

**అధిక ఫీజులు వసూలు**

**విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన**

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్**

పట్టణంలో ప్రయివేటు విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. దీంతో ఫీజులు కట్టలేక విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని ప్రయివేటు విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు. అయితే అదే అదునుగా చేసుకుని ఆయా విద్యాసంస్థలు తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పట్టిపీడిస్తున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఐదో తరగతి విద్యార్థికి ఫీజు రూ.35,000 వేలు ఉంటే పైతరగతులకు ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఏటా జూన్‌లో ప్రతి విద్యాసంస్థల్లో అడ్మిషన్లు జరుగుతుంటాయి. అయితే ఇదే అదునుగా చేసుకుని ప్రయివేటు విద్యాసంస్థలు అధిక ఫీజుల పేరుతో లక్షల్లో సొమ్ము దోచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



అసలు ప్రయివేటు విద్యాసంస్థలు ఫీజుల పట్టిక కచ్చితంగా అమలు చేయాల్సి ఉన్నా అది ఎక్కడా అమలు కాని పరిస్థితి నెలకొంది. ఎక్కడా కనీసం బోర్డు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఫీజుల పేరుతో దోచేస్తున్నా కనీసం జిల్లా విద్యాశాఖ అధికారులు గానీ, మండల విద్యాశాఖ అధికారులు గానీ అటువైపు చూడకపోవడం గమనార్హం. జిల్లా, మండల స్థాయి అధికారులకు ముడుపులు ముట్టాయని, అందుకే అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక ఫీజులతో తమ పిల్లలను ఎలా చదివించుకోవాలో అర్థం కావడం లేదని, పేద, ధనిక అనే తేడా లేకుండా ఫీజుల విషయంలో ప్రయివేటు విద్యా సంస్థలు కఠినత్వాన్ని అవలంబిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై తగు చర్యలు తీసుకుని పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజుల భారాన్ని తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## చిన్నారులు, గర్భిణులకు నాణ్యమైన సేవలందించాలి

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే సేవలు నాణ్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరం వద్ద జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ అధికారి, సిడిపిఒలు, సూపర్‌వైజర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తరచూ సిడిపిఒలు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో సందర్శించి వారికి అందుతున్న సేవలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. వారం, వారం ప్రగతి కనిపించాలన్నారు. తరువాత సమావేశంలో క్షుణ్ణంగా సమీక్షిస్తామని తెలిపారు. కచ్చితమైన సంఖ్యలను మాత్రమే నమోదు చేయాలన్నారు. అంగన్వాడీలో పిల్లలకు నేర్పించే విషయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రక్తహీనత కలిగిన గర్భిణులు తీసుకోవాల్సిన టాబ్లెట్లు, ఆహారంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే జన్మించిన శిశువును ఎలా చూసుకోవాలి, చిన్నారులను ఏ సీజన్లో ఎలా చూసుకోవాలి తదితర విషయాలపై బాలింతలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి బి.సుజాత రాణి, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

## 26న భీమవరంలో రాష్ట్రస్థాయి సెమినార్

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పర్సా సత్యనారాయణ శత జయంతిని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి సెమినార్ భీమవరంలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్‌వి గోపాలన్, కె.రాజా రామ్మోహన్ రాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక వర్గ ప్రయోజనాల కోసం కడవరకూ కృషిచేసిన అమరజీవి పర్సా సత్యనారాయణ శతజయంతి కార్యక్రమాల్లో భాగంగా భీమవరంలో కార్మికవర్గం - ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అమరజీవులకు నివాళులర్పించడం అంటే వారి ఆశయ సాధనకు పనిచేయడమేనని తెలిపారు. కార్మిక ఉద్యమంలో కార్మికుల పక్షాన నిలబడి జీవించిన ఎందరో మహనీయులు ఉన్నారని, వారందరినీ స్మరించుకుంటూ సిఐటియు నిరంతరం వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. పాలకుల విధానాల కారణంగా కార్పొరేట్ శక్తులు మరింత శక్తివంతంగా, పేదలు మరింత పేదలుగా మారిపోతున్న నేటి తరుణంలో కష్టజీవులు వారి హక్కులు, చట్టాల రక్షణ కోసం చేస్తున్న పోరాటాల్లో వారికి అండగా నిలబడడం సిఐటియు ప్రత్యేక లక్షణమని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, శ్రామిక జనం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందులో భాగంగానే వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టామని తెలియజేశారు. ఈ సెమినార్‌కు కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మంతెన సీతారాం, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రసంగిస్తారని తెలియజేశారు. ఈ సెమినార్‌కు ఉద్యోగులు, కార్మికులు హాజరు కావాలని కోరారు.

## నిమ్మలను కలిసిన ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

**ప్రజాశక్తి - పాలకొల్లు**

రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ మంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్ప గుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సాపురం డివిజన్‌లో పరిపాలనాపరమైన అంశాల గురించి ఆర్‌డిఒతో చర్చించారు. ఖరీఫ్ ఆకుమళ్లు త్వరగా వేసుకొనేలా రైతులను సంసిద్ధత గురించి వారు చర్చించారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అంబరీష్

## బిపిహెచ్‌యు నిర్మాణాలు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

జిల్లాలో చేపట్టిన బిపిహెచ్‌యుల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ, రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమావేశమై బిపిహెచ్‌యు(బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్)ల నిర్మాణాలపై ఆరా తీశారు. జిల్లాలో యండగండి, పోడూరు, బిపిహెచ్‌యులు స్లాబ్ దశలో ఉన్నాయని, అత్తిలిలో నిర్మాణం ప్రారంభమైందని, ఎల్‌బి.చర్ల, దొడ్డిపట్లలలో నిర్మాణాలను ప్రారంభించాల్సి ఉందని అధికారులు కలెక్టర్ వివరించారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ నిర్మాణంలో ఉన్నవి వెంటనే పూర్తిచేసి అందుబాటులోనికి తీసుకురావాలని, అలాగే నిర్మాణాలు చేపట్టాల్సిన రెండు బిపిహెచ్ యూనిట్ల నిర్మాణాలకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రాం కింద నిర్మాణాలను చేపట్టడం జరిగిందని, నిధులు కొరత లేదని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా రోడ్లు భవనాల శాఖ అధికారి ఎల్.లోకేశ్వరరావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం బకాయిలు చెల్లించాలి

### సిపిఎం నాయకులు తలుపూరి బుల్లబ్బాయి

**ప్రజాశక్తి - ఆచంట**

ఎండనకా వాననకా ఎంతో కష్టపడి పండించి, ధాన్యం అమ్మి, రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ధాన్యం డబ్బులు చెల్లించకపోవడం దురదృష్టకరమని సిపిఎం సీనియర్ నాయకులు తలుపూరి బుల్లబ్బాయి అన్నారు. బుధవారం సాయంత్రం కౌలు, పేద రైతులకు తక్షణమే ధాన్యం బకాయిలు చెల్లించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం తహశీల్దార్ ఐపిశెట్టికు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో కేవలం ఏడు కోట్ల వరకు మాత్రమే ధాన్యం డబ్బులు అందాయని, మరో రూ.55 కోట్ల వరకు ధాన్యం డబ్బులు రావాల్సి ఉందన్నారు. పంటలు పండించేది కౌలురైతులు, పేద రైతులు మాత్రమేనన్నారు. వీరంతా పెట్టుబడి నిమిత్తం లక్షలాది రూపాయలు ప్రయివేటు అప్పులు తెచ్చి పంటకు పెట్టుబడి పెడుతున్నారన్నారు. ప్రభుత్వం నెలలు తరబడి ధాన్యం డబ్బులు ఇవ్వకపోవడంతో తెచ్చిన అప్పులకు అధిక వడ్డీలు కట్టి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు వరికోత మిషన్, కూలీలు, బరకాలు, ధాన్యం ఎగుమతి వంటి ఖర్చులు ఉండటంతో పాటు, సార్వా సాగు ముందుకు రావడంతో రైతాంగం తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారు.కావున ఉన్నతాధికారులు ఈ సమస్యను తక్షణం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ధాన్యం డబ్బులు వెంటనే వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నర్సింహా మూర్తి, గుత్తుల రంగారావు, పి.మోహన్ రావు, కుసుమే జయరాజు, నాయకులు తోటపల్లి సత్యనారాయణ, కొండేటి రాఘవులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతినందిస్తున్న సిపిఎం నాయకులు

# సికిల్ సెల్ అనీమియా అంటువ్యాధి కాదు : డిఎంహెచ్‌ఒ

**ప్రజాశక్తి - ఉండి**

సికిల్ సెల్ అనీమియా అంటువ్యాధి కాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.లక్ష్మి సునంద ఆధ్వర్యంలో ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినోత్సవాన్ని నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా అంటువ్యాధి కాదని, కేవలం జన్యు లోపంతోనే వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి అని అన్నారు. ఈ వ్యాధి వల్ల భరించలేని నొప్పులు, రక్తహీనత వంటి లక్షణాలు కలుగుతాయని, వీటిని ఆదిలోనే గుర్తించి రక్తహీనతను నివారించేందుకు పోలిక్ యాసిడ్ మాత్రలను వాడాలని సూచించారు. సికిల్ సెల్ కణాలు కొడవలి ఆకారంలో ఉంటాయని, ఇవి తక్కువ జీవితకాలం కలిగి ఉంటాయన్నారు. రక్తహీనత, అలసట, కళ్లు పసుపు రంగులోకి మారడం, తరచుగా అంటువ్యాధులు రావడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అంగవైకల్యం, గర్భధారణ సమయంలో సమస్యలు రావడం వంటివి సికిల్ సెల్ అనీమియా లక్షణాలుగా ఉన్నాయన్నారు. రక్తం అధికంగా నష్టపోయినప్పుడు రక్తం ఎక్కించాలని, పోలిక్ యాసిడ్ మాత్రలు వాడి రక్తహీనతను నివారించవచ్చని ఆయన తెలిపారు. రక్త పరీక్షలు నిర్ణీత సమయంలో చేయించుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సికిల్ సెల్ అనీమియా వ్యాధితో బాధపడే వ్యాధిగ్రస్తులకు రూ.10 వేల పెన్షన్ అందించి ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ సిహెచ్.భావన, ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య విస్తరణ అధికారి ఆర్.కృష్ణకుమార్, హెల్త్ అసిస్టెంట్స్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.



గణపవరం: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

**గణపవరం:** సికిల్ సెల్ అనీమియా వ్యాధితో తెలంగాణ, ఒరిస్సా ప్రాంత వాసులు ఎక్కువగా బాధపతున్నారని, ప్రతి ఒక్కరూ ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సంతోష్ నాయుడు అన్నారు. గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినోత్సవం నిర్వహించి, ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సంతోష్ నాయుడు మాట్లాడుతూ ఈ వ్యాధి లక్షణాల గురించి ఆయన వివరించారు. వ్యాధి సోకితే రక్త కణాల సంఖ్య తగ్గుతుందని, కళ్లు పసుపు రంగులో మారుతాయని అన్నారు. ఈ వ్యాధి నిర్మూలనకు భారత ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, హెచ్‌వి.పద్మజ, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఎమ్ఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.




ఉండిలో..


పిప్పరలో పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోష్ కుమార్ రెడ్డి, ప్రియాంక, ఎంపిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

**పాలకొల్లు రూరల్:** లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.నవ్య జీవన్ ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.నవ్య జీవన్ మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి అనగా వారసత్వంగా వచ్చే ఎర్ర రక్త కణాల రుగ్మత అన్నారు. సాధారణంగా ఎర్ర రక్త కణాలు గుండ్రంగా ఉంటాయి కానీ ఈ సికిల్ సెల్ అనీమియాలో ఎర్ర రక్త కణాలు అర్ధచంద్రాకారంగా కొడవలి రూపంలో ఉంటాయన్నారు. ఆక్సిజన్ సరఫరా చేయడానికి ఆటంకాన్ని కలిగిస్తాయి. ఇవి తల్లిదండ్రుల నుంచి వంశపారంపర్యంగా ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతాయని తెలిపారు. అందుకే మేనరికపు వివాహాలు చేసుకోకూడదని అంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌ఎన్ పి.ఎలిజిబెత్, సూపర్వైజర్లు ఎస్‌కె.అమలేశ్వర రావు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్

**తణుకు :**గ్రామీణ ఉపాధి హామీ కూలీల బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిపిఎం ఆధ్వర్యంలో ఉపాధి కార్మికుల సమస్యలు తెలుసుకోవడం కోసం కొమరవరం గ్రామంలో పర్యటన చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ కార్మికులు సమస్యలు తెలుసుకొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి ఉన్న నిధులు ప్రతీ బడ్జెట్‌లో తగ్గిస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వంలో ఉపాధి హామీ కార్మికులకు నేటికీ కనీస వేతనం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత కష్టపడినా రోజుకి వంద రూపాయలు రావడం లేదన్నారు. గత ఏప్రిల్ నుంచి ఉపాధి కార్మికులకు డబ్బులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 100 రోజులు పని చూపడంలో అధికారులు, ప్రభుత్వం శ్రద్ధపెట్టాలని తెలిపారు. పే స్లిప్పు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.600 ఇవ్వాలని తెలిపారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

## బహుముఖ ప్రజ్ఞాశాలి హనుమంతరావు

**భీమవరం టౌన్:** రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన మోటూరు హనుమంతరావు అన్ని రంగాల్లో సమగ్రమైన అవగాహన కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని మంతెన సీతారాం కొనియాడారు. మోటూరు హనుమంతరావు 23వ వర్ధంతి సభ స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగింది. ఆయన చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన గురించిన విషయాలు కార్యకర్తలతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యవర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, కౌరు పెద్దిరాజు, పి.వి.ప్రతాప్, డి.కళ్యాణి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి మృతి


చంద్రశేఖర్ (ఫైల్)

**పెనుమంట్ర:** మండలంలోని మార్టేరు(నెగ్గిపూడి) శ్రీ వేణు గోపాల ఉన్నత పాఠశాలలో సుమారు 40 సంవత్సరాల సుదీర్ఘకాలం ఉపాధ్యాయునిగా పనిచేసి, తన 58వ ఏట ఉద్యోగ విరమణ పొందిన తేతలి చంద్రశేఖర్ రెడ్డి బుధవారం తెల్లవారుజామున వారి కుమార్తె ఇంటి దగ్గర కీర్తిశేషులయ్యారు. నూరు సంవత్సరాలకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన ఎస్‌విజిలో ఆయన సైన్స్, మాథ్స్ చెప్పేవారు. పేరు పొందిన లెక్కల మాస్టారుగా వారు ప్రసిద్ధి చెందారు. ఆయన దగ్గర విద్య నేర్చుకున్నవారు ప్రస్తుతం వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వారి మృతికి పాఠశాల పూర్వ విద్యార్థులు, పెన్షనర్లు, సంఘ ప్రతినిధులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపి, నివాళులర్పించారు.

## జగన్మోహన్‌రెడ్డి శిలాఫలకాలు ధ్వంసం

### నిందితులను కఠినంగా శిక్షించాలి : వైసిపి నాయకులు

**మొగల్తూరు:** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని జగన్నాధపురంలో రైతు భరోసా కేంద్రాలకు, సచివాలయాలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రంతో కూడిన శిలాఫలకాలు, నవరత్నాల వివరాలతో కూడిన శిలాఫలకాలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బుధవారం గ్రామస్తులు గమనించి నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, ఉపసర్పంచ్ సరిపల్లి జ్యోతి ప్రసాదరావు, సొసైటీ మాజీ ఛైర్‌పర్సన్ తోటకూర శివాజీరాజు, నాయకులు నడింపల్లి సుబ్బరాజు, రేవు రాంబాబు, బొక్క వెంకటేశ్వరరావు, దొంగ మురళీ ధ్వంసం చేసిన శిలాఫలకాలను పరిశీలించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

## చేనేత, చేతి వృత్తుల వారిని ఆదుకోవాలి

**పెనుమంట్ర:** చేనేత, చేతి వృత్తుల వారిని గత ప్రభుత్వం కంటే మెరుగ్గా కొత్త ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కర రావు కోరారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాస్తవంగా ఉన్న చేనేత వ్యవస్థ పరిస్థితిని పరిశీలించాలన్నారు. మిగిలిన చేతివృత్తుల కంటే చాలా భారంగా ఉన్న చేనేతల మీద జిఎస్‌టి, చేనేత వస్త్రాలకు కనీస, గిట్టుబాటు ధర గాని లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతలకు ఉచితంగా 200 యూనిట్లు విద్యుత్తు ఇవ్వాలని, రోజులో 24 గంటల కాలం మగ్గం దగ్గర కాళ్లు, చేతులు ఆడితేనే కష్టం తీరని చేనేత కార్మికులను తక్షణమే ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో చేనేతలకు రూ.24 వేలు అందిస్తున్నారు, కొత్త ప్రభుత్వంలో అంతకు మించి చేనేతలకు అందాలి ఉండాలని ఆయన అన్నారు. ప్రతి నియోజకవర్గంలో రైతు బజార్ లాగా నేత బజార్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

### ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు

**కాళ్ల:** ప్రజల భాగస్వామ్యంతో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పెద అమిరంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో రైతుల కోసం మురుగు కాలువల అభివృద్ధి కోసం తన వంతు విరాళంగా రూ.5 లక్షల చెక్కును అందజేశామన్నారు. నియోజకవర్గంలోని మురుగు కాలువల బాగు కోసం కలెక్టర్ సహకారంతో (డ్రెయినేజీ మెయింటెనెన్స్ ప్రాజెక్ట్స్) ఫండ్ ఉండి 'పేరుతో' ప్రత్యేక ఖాతాలు తెరిచిందని తెలిపారు. ప్రజలంతా తమ సహాయ సహకారాలను అందించాలని కోరారు.

**డయాలసిస్ బాధితులకు మూడు పరికరాల కిట్లు ఏర్పాటుకు సిద్ధం**

ఉండి నియోజకవర్గంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వారు డయాలసిస్ చేయించుకునేందుకు తగిన సదుపాయాలు లేక తరచూ ఏలూరు, విజయవాడ వెళ్లవలసి వస్తుందని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు తెలిపారు. డయాలసిస్ బాధితులు పడుతున్న ఇబ్బందిని చూసి తాను, మరికొద్ది మంది దాతలు డయాలసిస్ కోసం అవసరమయ్యే మూడు పరికరాల కిట్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## ఉపాధ్యాయులకు యోగా శిక్షణ

**ఆకివీడు :** పతంజలి యోగ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు యోగా ఆరోగ్య కేంద్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.బలరాం ప్రకాష్ కుమార్, ధ్యాన ప్రచారకులు ఉంటివాడ సాంబశివరావులు తెలిపారు. బుధవారం డాక్టర్ ప్రతాప్ కుమార్ ఆసుపత్రిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 21వ తేదీ శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లోనూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## రజకుల చెరువు సమస్యపై కలెక్టర్‌కు వినతి

**ఏలూరు అర్బన్:** ఆకివీడు మండలం పెదకాపవరం రజకుల చెరువు సమస్యపై బుధవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘ అధ్యక్షులు, రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి విలకులపాటి కళ్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పెదకాపవరం గ్రామంలో రజకులకు మాజీ ముఖ్యమంత్రి రామచంద్రారెడ్డి గారు 70 సెంట్లు స్థలాన్ని కొని రజకులకు చెరువుగా తవ్వించడం, సాగర్ చెరువుని రజకచెరువుగా అడంగల్‌లో చూపించడం జరిగిందని, తదుపరి 2023లో అడంగల్‌లో రజక చెరువును 'పేరు మార్చేసి' ఇంకొకరి 'పేరు' పెట్టడం జరిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ విషయంపై భీమవరం ఆర్‌డిఒను విచారణ అధికారిగా నియమించిన కలెక్టర్ వెంటనే విచారణ చేసి రజకులకు సహాయం చేయాలని ఆదేశించడం జరిగిందని కళ్యాణ్ తెలిపారు. వెంటనే స్పందించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పరిశుభ్రత పాటించాలి

**ఆకివీడు :** గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పరిశుభ్రతను పాటించాలని డిపిఒ విక్టర్ సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన మండలంలోని దుంపగడప తిమ్మరాజు కాలనీ శివారు ప్రాంతాలను పరిశీలించారు. గ్రామంలో మంచినీరు, పారిశుధ్య పరిశోధన ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని చెప్పారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి సన్నిధిలో హీరో నిఖిల్

**నరసాపురం:** మండలంలోని వేమూలదీవి వెస్ట్ కాపుల కొడప గ్రామంలో వెంచేసియున్న శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామిని బుధవారం సినీ హీరో నిఖిల్ దర్శించుకున్నారు. మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన వరుసకు సోదరి కుమార్తెను కన్నెర్ల క్రితం నిఖిల్ వివాహం చేసుకున్నారు. బుధవారం నిఖిల్ కుటుంబ సమేతంగా వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

## టిడ్కో గృహాల్లో ప్రతి లైట్ వెలగాలి : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర మంత్రిగా నిమ్మల రామానాయుడు టిడ్కో గృహాలను పరిశీలించారు. అక్కడ సమస్యలను స్వయంగా చూసి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ప్రతి వీధి లైట్ వెలిగించాలని విద్యుత్ ఎఇ సతీష్‌ను మంత్రి ఆదేశించారు.




# పలు పాఠశాలల్లో విద్యార్థులకు కిట్లు అందజేత

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పాఠ్యపుస్తకాలు, విద్యా సామాగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. బుధవారం ఆచంట మండలం వల్లూరు, భీమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యాసామాగ్రిని ఆయా గ్రామాల సర్పంచులు నేలపూడి బేబీ, గుబ్బల మాధవరావు చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి సూర్యకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా చర్యలు చేపట్టారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేసే విధంగా శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులు మంచిగా చదువుకుని మంచి భవిష్యత్తుకు పునాదులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జగనన్న విద్యా దీవెనను అంబేద్కర్ విద్యా దీవెనగా నామకరణం చేయడం ఎంతో హర్షించదగ్గ విషయం అని చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపసర్పంచులు, టిడిపి నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

**మొగల్తూరు:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. బుధవారం మొగల్తూరు పంచాయతీ పరిధి కోట వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, బెల్టు, సాక్స్, బ్యాగ్ల తదితర విద్యాసామాగ్రి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన కిట్లు ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు యర్రమిల్లి గణపతి, ఉపాధ్యాయురాలు కెఎన్.సుజాత తదితరులున్నారు.

**నరసాపురం:** చినమామిడిపల్లి మున్సిపల్ హై స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ కిట్లను విద్యార్థులందరూ చక్కగా వినియోగించుకుని బాగా చదువుకోవాలన్నారు. చదువు కోవడం ద్వారానే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయలు బి.సూర్యకుమారి మాట్లాడుతూ 10వ తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరచారన్నారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుందని చెప్పారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు ఆర్‌ఆర్‌కె.రాజు విద్యార్థులకు ఇంకా ఏమైనా నోటు పుస్తకాలు అవసరమైతే తాను అందజేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పాలూరి నరసింహారావు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ బళ్ల నాగ వెంకటేశ్వర్లు, బళ్ల తాతాజీ పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెంలో కిట్లు అందజేస్తున్న టిడిపి నేతలు

**ఉండి:** ప్రతీ విద్యార్థి చదువులో రాణించాలని స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాదిరాజు వెంకట రామకృష్ణంరాజు అన్నారు. బుధవారం చెరుకువాడ పెద్దపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. సభకు పాఠశాల హెచ్‌ఎం మంగతాయారు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణంరాజు మాట్లాడుతూ దాతలు, విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రిని పంపిణీ చేస్తున్నారని, ప్రతి విద్యార్థి వీటిని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని కోరారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్ కళ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముదునూరి శివరామరాజు, గొట్టుముక్కల రాము, పెన్మెత్స రంగప్రసాద్ రాజు, రామాంజనేయులు, సిఆర్‌పి సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం:** ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులను దృష్టిలో పెట్టుకొని బాగా కష్టపడి చదివి ఉన్నత విద్యావంతులు కావాలని, తద్వారా ఈ సమాజానికి, అలాగే రేపటి భవిష్యత్తుకు ఉపయోగపడాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గొర్రెల శ్రీధర్ తెలిపారు. బుధవారం స్థానిక 18వ వార్డులోని మాగుంట అన్నపూర్ణాదేవి మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, కిట్లు, స్కూల్ బ్యాగ్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చిన్ననాటి నుంచి చదువుపై ఆసక్తిని కనబరచాలన్నారు. చదువుల్లో రాణించే విద్యార్థులకు ఉన్నత అవకాశాలు లభిస్తాయన్నారు. అక్షరాస్యత శాతాన్ని పెంపొందించే దిశగా కూటమి ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను కలగజేస్తుందన్నారు. తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు(బాబ్జి) సహకారంతో రానున్న రోజుల్లో మన నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉంటూ అన్ని వర్గాల వారికి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ హనుమ, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'బడికి పోదాం రా' కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడం సామాజిక బాధ్యతగా తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ 'బడికి పోదాం రా'.. కార్యక్రమ బ్రోచర్‌ను శ్రీవిజ్ఞానవేదిక, సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఆయన ఆవిష్కరించారు. పేద, మధ్య తరగతి కుటుంబీకులు కుటుంబ పోషణ నిమిత్తం పిల్లలను పనిలో పెట్టడం వారి జీవితాలను తుంగలో పెట్టినట్లేనని, ఇంత అభివృద్ధి చెందిన కాలంలో కూడా ప్రభుత్వం ఎన్నో పథకాలు కల్పిస్తున్నా తమ పిల్లలను బడిలో చేర్పించకపోవడం దారుణమని అన్నారు. ప్రస్తుత తరుణంలో విద్యావ్యవస్థ పోటీలో ఉందని, కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ర్యాంకులు సాధిస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశ పెట్టిన బడికి పోదాం రా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం పట్టణం ప్రముఖ విద్యా కేంద్రంగా ఉందని, డ్రాప్‌అవుట్స్ అయిన బాలబాలికలను గుర్తించి బడిలో చేర్పించడం బడికి పోదాం రా కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. మంత్రి శ్రీనివాస్ స్ఫూర్తితో పిఎస్‌ఎం హైస్కూల్‌లో గీతా సహన్ అనే బాలికను 8వ తరగతిలో చేర్పించి నోట్ పుస్తకాలను అందించామని తెలిపారు.

# అంబేద్కర్ పేరు కొనసాగించడం అభినందనీయం

### మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్

ప్రజాశక్తి - ఆచంట

జగనన్న విదేశీ విద్య పేరును మార్చి అంబేద్కర్ పేరును కొనసాగిస్తున్నట్లు జిఒ విడుదల చేయడం అభినందనీయమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విదేశీ విద్యా విధానానికి అంబేద్కర్ పేరు తొలగించి జగనన్న విదేశీ విద్య పేరు మార్చుకున్న సందర్భంలో అనేక సార్లు దళిత సంఘాలన్నీ కలిపి మొరపెట్టుకున్నా అంబేద్కర్ పేరును పెట్టడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించలేదన్నారు. దీనిపై ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంబేద్కర్ పేరును కొనసాగించాలని జిఒ విడుదల చేయడం పట్ల మాల మహానాడు తరపున హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితుల సంక్షేమం, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేలా ప్రభుత్వాలు కృషి చేయాలని పుష్పరాజ్ అన్నారు. గతంలో దళితులకు చెందినటువంటి 27 సంక్షేమ పథకాలు ఈ ప్రభుత్వం పునరుద్ధరించాలని, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు 100 శాతం ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని, బడుగు బలహీన వర్గాల వారి కోసం గతంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల వారి అభ్యున్నతి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఏర్పాటు చేసి ఆయా వర్గాల వారికి ఆర్థిక పరిపుష్టి పెంపొందించేలా చంద్రబాబు ప్రభుత్వం మరింత కృషి చేయాలని పుష్పరాజ్ కోరారు.

# ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఉండి

భావి భారత ప్రధానిగా అయ్యే అన్ని అర్హతలు రాహుల్ గాంధీకి పుష్కలంగా ఉన్నాయని నరసాపురం మాజీ ఎంపీ, టిటిడి బోర్డ్ మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు అన్నారు. బుధవారం జాతీయ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ 55వ జన్మదిన వేడుకలను ఉండి మెయిన్ సెంటర్‌లో ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనుమూరి బాపిరాజు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర వలన 2024 ఎన్నికల్లో అధికార బిజెపికి ఇండియా కూటమి ధీటుగా పోటీనిచ్చిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ హవా రోజు రోజుకీ తగ్గుతుందని ఇటీవల జరిగిన ఎన్నికలే తార్కాణమన్నారు. భారత ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర ఉపయోగపడిందన్నారు. గతంలోనే రాహుల్ గాంధీకి ప్రధానిగా అవకాశం వచ్చినా ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించిన గొప్ప వ్యక్తిత్వం రాహుల్ గాంధీది అని కొనియాడారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఎంతోకాలం ఉండదని, తొందరలోనే నరేంద్ర మోడీ ప్రజావ్యతిరేక విధానాలకు విసుగుచెంది ఎన్‌డియే మిత్ర పక్షాలు బయటకు వచ్చి ఇండియా కూటమికి మద్దతు పలుకుతాయని కనుమూరు బాపిరాజు ధీమా వ్యక్తం చేశారు. అనతికాలంలోనే రాహుల్ గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తారన్న నమ్మకం తనకుందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంపన సుబ్రహ్మణ్యం రాజు, వారాడ కొండలరావు, బొర్రా పార్థు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.


ఉండిలో రోగులకు పళుల అందజేస్తున్న బాపిరాజు

**భీమవరం టౌన్:** భీమవరం కాంగ్రెస్ కార్యాలయంలో నియోజవర్గం ఇన్‌ఛార్జి అంకెం సీతా రామ్ ఆధ్వర్యంలో బుధవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ టిటిడి ఛైర్మన్ కనుమూరి బాపిరాజు ముఖ్య అతిథిగా పాల్గొని రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపీ, మాజీ టిటిడి ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, నియోజవర్గం ఇన్‌ఛార్జి అంకెం సీతారామ్ మాట్లాడుతూ భారత దేశం వ్యాప్తంగా భారత జోడో యాత్ర కాశ్మీర్ టు కన్యాకుమారి సుమారు నాలుగువేల కిలోమీటర్లు పాదయాత్ర చేసిన వ్యక్తి రాహుల్ గాంధీ అన్నారు. భారత్ న్యాయ పోరాటం కోసం 3 వేల కిలోమీటర్లు భారతదేశ వ్యాప్తంగా పాదయాత్ర చేసిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ కావడం మనకు గర్వకారణమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డియే కూటమికి దీటుగా కాంగ్రెస్‌ని ముందుకు నడిపించిన వ్యక్తి రాహుల్ గాంధీ అని, అటు వంటి మహోన్నత వ్యక్తి పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం ఆనందాయకం అని కొనియాడారు. అనంతరం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి అంకెం సీతారామ్ ఆధ్వర్యంలో భీమవరం గవర్నమెంట్ హాస్పిటల్‌లో సుమారు 150 మంది రోగులకు బ్రెడ్, బట్టర్ మిల్క్ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెఎస్ఆర్, కాంగ్రెస్ నాయకులు మద్దాల సాయి, పశ్చిమగోదావరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోము నాగ కేశవ్ బాబు, భీమవరం జిల్లా యూత్ పట్టణ అధ్యక్షులు బోనం రవికుమార్ పాల్గొన్నారు.

## నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పిఎస్ఎన్.రాజు

ప్రజాశక్తి - ఉండి


రాజు (ఫైల్‌ఫోటో)

నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పాందువ్వ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్మెత్స వెంకట సత్యనారాయణ రాజును నియమించినట్లు సత్యనారాయణ రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేసినందుకు నోబెల్ టీచర్స్ అసోసియేషన్ సిద్ధంగా ఉందని, ఈనెల 16వ తేదీ మంగళగిరిలోని ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్‌సి అశోక్ బాబు, మాజీ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎఎస్ రామకృష్ణ, సీనియర్ ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు చెరుకూరి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావ్యవస్థ మెరుగుదలకు అనుసరించాల్సిన పలు ప్రతిపాదనలను తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షునిగా పేరాబత్తెన సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా తనను ఎన్నుకోవడం జరిగిందన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వంకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా ఫిర్యాదులు పరిగణలోకి తీసుకోవాలి

### జెసి ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - పోడూరు

ప్రజల ఫిర్యాదులు, సూచనలు తప్పకుండా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. కవిటం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పోడూరు, కవిటం సరిహద్దు ప్రాంతమైన నల్ల వెంకయ్య చెరువులో ఐఎంసి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ సంస్థ ద్వారా అయిల్, గ్యాస్ అభివృద్ధి సంస్థ డ్రిల్లింగ్, పైప్ లైన్ లతో ఉత్పత్తి చేయుటకు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, పర్యావరణ సామాజిక కార్యకర్తల వారి అభిప్రాయాలు వివరించారు. ఈ సమావేశంలో వివరించి పలు విషయాలపై స్పష్టత లేదన్నారు. పనులు మొదలు పెడితే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, నిధులు ఖర్చు చేసి గ్రామాన్ని దత్తత తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే రహదారులు మరమ్మతులకు గురి కాగా, వంతెనలు బలహీనంగా ఉన్నాయని వాటిని అభివృద్ధి చేయడంలో సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ అంబరీష్ మాట్లాడుతూ స్థానికుల అభిప్రాయ సేకరణ ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మురళీ కృష్ణ, ఎంపిడిఒ డి.సుహాసిని, ఆర్ఐ కె.రాంబాబు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసమే కూటమి

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**భీమవరం టౌన్:** రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసమే కూటమి ఏర్పడిందని, మీ ఆదరణతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, గాడి తప్పిన వ్యవస్థలను సక్రమ విధానంలోకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకువస్తారని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని వారి మామ సరిపిడకల రామారావు నివాసానికి విచ్చేసిన మంత్రి శ్రీనివాస్‌కు పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ, హౌసింగ్ బోర్డు డెవలప్‌మెంట్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా మంత్రి శ్రీనివాస్, లక్ష్మి సింధు దంపతులను సత్కరించారు. సభకు మందిర అధ్యక్షులు కంతేటి వెంకటరాజు అధ్యక్షతన వహించారు. మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా చైతన్యంతోనే కూటమి అఖండ విజయం సాధించిందని, ప్రజా తీర్పుగా తాము భావిస్తున్నామని, పేదల సంక్షేమం, విద్య, వ్యవసాయ, పరిశ్రమ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రజలు ఏదైతే మార్పు కోరుకున్నారో అందుకనుగుణంగా నిజాయితీగా చట్టప్రకారం కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతామని, ప్రజలను మోసం చేసి ఇబ్బందులు పెట్టే కార్యక్రమాలను సహించబోమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి వర్గంలో యువతకు ప్రాధాన్యత ఇచ్చారని, దానికి అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ యువతకే ప్రాధాన్యత ఇచ్చిన చంద్రబాబు అభినందనీయులని, రాష్ట్ర అభివృద్ధికి అందరూ కలిసి పని చేద్దామని అన్నారు. జనసేన మండల అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్, దేవస్థాన కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, జనపాటి మధు పాల్గొన్నారు.

## 'పవన్‌ది నీతివంతమైన పాలన'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నీతివంతమైన పాలన అందించేందుకు పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారని జనసేన సీనియర్ నాయకులు అడబాల నారాయణమూర్తి అన్నారు. జనసేన వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్ డిప్యూటీ సిఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం సాయంత్రం తాడేపల్లిగూడెం జనసేన కార్యాలయం వద్ద సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించడం ఒక సుదినమని పేర్కొన్నారు. గత పాలకులు స్వప్రయోజనాలనే చూసుకున్నారన్నారు. పవన్ కళ్యాణ్ రైతు సంక్షేమానికి, సైనికుల సంక్షేమం కోసం కృషిచేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారన్నారు. అలాగే నియోజకవర్గంలో బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజల అభిమానాన్ని చేరగుని 63 వేల మెజారిటీ సాధించారన్నారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు.

## కేన్సర్, డయాబెటిస్‌పై అవగాహన కల్పించాలి

**తణుకు :** కేన్సర్, డయాబెటిస్, హైపర్ టెన్షన్‌లపై అవగాహన కల్పించి, వ్యాధి సంక్రమణకు గురైన రోగులను ముందుగా గుర్తించి తగు జాగ్రలు తీసుకోవచ్చునని వైద్యులు సూచించారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ వారి ఆదేశాల మేరకు ఈనెల 13వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఎన్‌సిడి ప్రోగ్రాంలో భాగంగా ఓరల్, సర్వైకల్, బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్, డయాబెటిస్, హైపర్ టెన్షన్‌లపై శిక్షణ, అవగాహన తరగుతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.